క్లుప్తంగా

పన్నులు సకాలంలో చెల్లించాలి

కదిరి టౌన్: మున్సిపాలిటీకి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధి, సుందరీకరణకు సహకరించాలని కమిషనర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఇంటి పన్ను బకాయిలు దాదాపు రూ.10 కోట్ల దాకా పేరుకుపోయాయన్నారు. మార్చిలోపు పన్నులు చెల్లించాలని కోరారు. అప్పటికీ బకాయిదారుల్లో మార్పు రాకపోతే వారి ఇళ్లకు కరెంటు, నీరు, చెత్త సేకరణ ఆపేస్తామని హెచ్చరించారు. ఈ నెల మూడో తేదీ నుంచి ఖాళీ స్థలాలు అమ్మాలన్నా, కొనాలన్నీ ఖాళీ స్థలం పన్ను కట్టాలన్నారు. పన్ను కట్టని స్థలాల క్రయవిక్రయాలు జరగబోవన్నారు. సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు మాట్లాడుతూ అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

మహిళా టీచర్లకు ఘన సన్మానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలల్లో శనివారం సావిత్రిబాయిఫూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



సంగా నారాయణ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం జానకంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సంగా నారాయణ (74) శనివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి తదితరులు నారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, బుక్కపట్నం సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, మండల బూత్ లెవల్ మేనేజర్ పతంజలి, నీలూరి ఈశ్వర్, ఎల్‌ఐసీ చంద్ర, ఓబిలేసు, వైస్ సర్పంచ్ కృష్ణారెడ్డి, నారాయణస్వామి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పర్యావరణంపై అవగాహన



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎన్‌జీసీ డైరెక్టర్ స్రవంతి

కదిరి అర్బన్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలను శనివారం నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జీసీ) స్టేట్ డైరెక్టర్ స్రవంతి సందర్శించారు. 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఓబుల్‌రెడ్డి, ఎన్జీసీ జిల్లా కో ఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

పుట్టపర్తి: భూ సమస్యల పరిష్కారానికి రైతులు, రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని ఆర్డీఓ సువర్ణ సూచించారు. ఆమె శనివారం బుక్కపట్నం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్‌తో కలిసి మండల పరిధిలోని కొత్తకోట, పాముదుర్తి, అగ్రహారం రెవెన్యూ గ్రామాల పరిధిలో నాలుగు పెండింగ్ కేసులను విచారించారు.

ఎన్పీకుంట: వంకమద్ది పంచాయతీలో రైతులు సాగు చేసుకుంటున్న భూముల సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ఈటె రాము తహసీల్దార్‌ను కోరారు. వంకమద్దిలో శనివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 23 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న యువర్స్ ఫౌండేషన్ నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పేదలకు సేవ చేయడమే యువర్స్ ఫౌండేషన్ లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షేక్ శంషాద్‌బేగం తెలిపారు. పట్టణంలోని కొత్తపేట ఉషోదయ పాఠశాలలో శనివారం యువర్స్ ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. యువర్స్ ఫౌండేషన్ నిర్వాహకులు చాంద్‌బాషా, పోలా ప్రభాకర్, డాక్టర్ బీవీ సుబ్బారావు, బండ్లపల్లి రంగనాథ్, వైకే శ్రీనివాసులు సేవా కార్యక్రమాల గురించి వివరించారు.

నూతన కార్యవర్గం ఎంపిక

యువర్స్ ఫౌండేషన్ నూతన అధ్యక్షుడుగా శీలా నాగేంద్ర, ఉపాధ్యక్షుడుగా సుంకు సుకుమార్, ప్రధాన కార్యదర్శిగా జయరాం, జాయింట్ కార్యదర్శిగా గర్రె రమేష్‌బాబు, ట్రెజరర్‌గా వంకదారి మోహన్, పీఆర్‌ఓగా రాధాకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిర్మించారు.. వదిలేశారు



జాతీయ రహదారి పక్కన నిరుపయోగంగా ఉన్న గోదాములు

- గోరుచిక్కుడు జిగురు పరిశ్రమ కోసం గోదాముల నిర్మాణం
- ఇందుకోసం రూ.4.5 కోట్ల నిధులు కేటాయింపు
- 2019లో చిరుధాన్యాల యూనిట్‌గా మార్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రారంభించేందుకు చర్యలు తీసుకోని అధికారులు

కనగానపల్లి: రూ.కోట్ల ప్రభుత్వ ధనం వెచ్చించి నిర్మించిన గోదాములు నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలోని దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన గోరుచిక్కుడు జిగురు మార్కెటింగ్, ప్రాసెసింగ్ పరిశ్రమ కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వంలో గోదాముల నిర్మాణాన్ని చేపట్టారు. ఇందుకోసం జాతీయ రహదారి పక్కన విలువైన 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. తర్వాతా గోదాముల నిర్మాణం కోసం రూ.4.5 కోట్ల నిధులు కేటాయించారు. 2018 ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించారు. కాని టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు సక్రమంగా నిధులు మంజూరు కాలేదు. అలాగే గోరుచిక్కుడు పంట సాగు కూడా తగ్గిపోవటంతో గోదాముల నిర్మాణం కూడా కొద్ది రోజులు ఆగిపోయింది.

ఆగిపోయిన గోరుచిక్కుడు సాగు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల 2014 నుంచి 2018 వరకు తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో జిల్లాలోని కొందరు రైతులు వేరుశనగ సాగు తగ్గించి తక్కువ వర్షపాతానికి పండే గోరు చిక్కుడు పంట సాగుచేసేందుకు ముందుకొచ్చారు. కాని ఈ పంటను కొనుగోలు చేసేందుకు ఈ ప్రాంతంలో మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో స్థానిక రైతులు, వ్యవసాయాధికారులు గోరు చిక్కుడు జిగురు పరిశ్రమను నెలకొల్పాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో రైతులు పండించిన గోరు చిక్కుడు విత్తనాలను కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేసేందుకు గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాని అప్పటి ప్రభుత్వం గోదాములు నిర్మాణం పూర్తి చేసేలోపు రైతులు గోరుచిక్కుడు పంటను సాగు చేయడం నిలిపేశారు.

ప్రారంభిస్తే మేలు..

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతా అర్ధంతరంగా ఆగిపోయిన గోరుచిక్కుడు జిగురు పరిశ్రమను చిరుధాన్యాల నిల్వ యూనిట్‌గా మార్పు చేశారు. దీంతో అధికారులు ఆగిపోయిన గోదాముల నిర్మాణం పనులు తిరిగి ప్రారంభించి 95 శాతం పైగా పనులు పూర్తి చేయించారు. తర్వాత వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు ఎవ్వరూ వీటి గురించి పట్టించుకోలేదు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన గోదాములు నిరుపయోగంగా ఉన్నాయి. దీనికి తోడు ఈ గోదాముల చుట్టూ ప్రహరీ లేకపోవటంతో వీటికి రక్షణ కరువైంది. నిరుపయోగంగా ఉన్న ఈ గోదాములను ప్రభుత్వం వెంటనే ప్రారంభించి రైతులకు ఉపయోగకరంగా మార్చాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

సమాచారం లేదు

నిరుపయోగంగా ఉన్న ఈ గోదాములపై మార్క్‌ఫెడ్ జిల్లా అధికారులను సంప్రదించగా.. ఈ గోదాముల వినియోగంపై మా వద్ద పూర్తి సమాచారం లేదని తెలిపారు. రాష్ట్రస్థాయి అధికారులే దీనిపై వివరణ ఇవ్వాలన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేదెప్పుడు?

బత్తలపల్లి: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు సెంటున్నర చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఆరు నెలలవుతున్నా నెరవేర్చలేదన్నారు. సర్వేనంబర్ 401లో పేదలు గుడిసెలు వేసుకున్నారని, అధికారులు సర్వే చేసి ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎస్‌డీటీ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ముసుగు మధు, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, మండల కార్యదర్శి బండల వెంకటేష్ పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘం లీడర్‌పై కేసు

కదిరి టౌన్: సంఘం సభ్యులకు కుచ్చు టోపీ వేసి రూ.7 లక్షలతో ఉడాయించిన స్వయం సహాయక సంఘం లీడర్‌పై కేసు నమోదు చేసినట్లు కదిరి సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. కదిరిలోని అమీన్‌నగర్ ప్రాంతానికి చెందిన ఖాజా–ఎ–గౌస్ డ్వాక్రా మహిళ సంఘంలో పది మంది సభ్యులు ఉన్నారు. ఈ సంఘానికి లీడర్‌గా గౌసియా, రెండో లీడర్గా మొఘల్ నస్రీన్ వ్యవహరిస్తున్నారు. సంఘం ద్వారా మంజూరైన రూ.10లక్షల రుణాన్ని సభ్యులందరూ సమానంగా పంచుకున్నారు. ఈ మొత్తానికి సంబంధించి ప్రతి నెలా కంతులను లీడర్ గౌసియాకు చెల్లించేవారు. ఇలా 16 నెలలకు సంబంధించిన కంతులను బ్యాంక్‌కు చెల్లించకుండా లీడర్ గౌసియా, ఆమె భర్త సిరాజ్ సొంతానికి వాడుకుని మోసం చేశారు. ఆలస్యంగా ఈ విషయాన్ని పసిగట్టిన సభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం గౌసియా దంపతులపై కేసు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు బోల్తా

కనగానపల్లి: ముక్తాపురం సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఓ కారు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన మేరకు... అనంతపురం నుంచి బెంగుళూరు వైపు వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి రహదారి పక్కన గుంతల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన డ్రైవర్ కార్తీక్‌ను స్థానికులు కాపాడి 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు.

పేద విద్యార్థులకు వరం మధ్యాహ్న భోజనం



కదిరి బాలికల జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ

కదిరి అర్బన్/ అమడగూరు/ ముదిగుబ్బ/ తాడిమర్రి/ నల్లమాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే పేద విద్యార్థులకు ఈ పథకం వరం లాంటిదని వక్తలు పేర్కొన్నారు. కదిరిలోని బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆర్డీఓ వెంకట సన్యాసిశర్మ ప్రారంభించి విద్యార్థులకు వడ్డించారు. ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర ప్రసాద్, హరీంద్రప్రసాద్, ఎంఈఓ ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు ఎంఎస్ ప్రశాంత్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. అమడగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఈఓ సంపూర్ణ, ప్రిన్సిపాల్ ప్రభాకర్ భోజన పథకాన్ని ప్రారంభించారు. ముదిగుబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల విద్యాధికారి రమణప్ప, సీఐ శివరాముడు, ప్రధానోపాధ్యాయులు గోపాల్ తదితరులు పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇక తాడిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీడీఓ రంగారావు, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ సి.సురేష్, సర్పంచులు తదితరులు విద్యార్థులకు భోజనం వడ్డించారు. ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. నల్లమాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు ప్రారంభించారు. తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఎంఈఓ 2 సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ ఉదయ్‌భాస్కర్, సీఐ నరేంద్రరెడ్డి, సర్పంచ్ భారతి, హైస్కూల్ హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించండి



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ, వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించాలని ల్యాబ్ టెక్నీషియన్స్ అసోషియేషన్ సభ్యులు శనివారం డీఎంహెచ్‌ఓను కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్లను డీఎంహెచ్‌ఓ చేతుల మీదుగా ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లకు ప్రమోషన్‌లు కల్పించాలని కోరారు. గ్రేడ్–1 ల్యాబ్ సూపర్‌వైజర్‌గా పదోన్నతి కల్పించాలన్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో 63 పరీక్షలు, సీహెచ్‌సీ ల్యాబ్‌లో 75 ల్యాబ్ టెస్ట్‌లు చేయడానికి పని ఒత్తిడి అధికంగా ఉందని, టెక్నీషియన్ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్లతో సమానంగా ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్లకు వేతనాలు అందించాలన్నారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ తిప్పయ్య, డెమో బాబాఫక్రుద్దీన్, ఏఎంఓ లక్ష్మానాయక్ , అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి శ్రీనివాసులు, సభ్యులు భాస్కర్‌రెడ్డి, నాగభూషణ, ఆదిల్, మస్తాన్, కుమారి, సతీష్, అనిల్, తనూజ, మాలతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్య రక్ష పక్కాగా అమలు చేయాలి



చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ నివేదిత, వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష, బాల్య సంరక్షణ విద్య కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత సూచించారు. శనివారం జగరాజుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించి ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూడాలన్నారు. బాలల సంపూర్ణ ఆరోగ్య పరీక్షల్లో పుట్టుకతో లోపాలు, పౌష్టికాహార లోపాలు, చిన్నతనంలో వచ్చే వ్యాధులు, మానసిక ఎదుగుదల లేకపోయినా పరీక్షించి వైద్యం అందిస్తారన్నారు. తల్లిపాల విశిష్టత, రక్తహీనత, సకాలంలో టీకాలు వేయించడం మరువ రాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోస్న, డాక్టర్ భవ్య, సీహెచ్‌ఓ నగేష్, హెచ్‌ఎం జగదీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

తనకల్లు: చీకటిమానిపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) నాగేంద్రనాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు తగిన ఆరోగ్య సలహాలను అందజేయాలన్నారు. మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

పిల్లల్లో సమగ్ర అభివృద్ధి అవసరం

అమడగూరు/ పుట్టపర్తి: పిల్లల్లో సమగ్ర అభివృద్ధి అవసరమని ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. అమడగూరులోని అంగన్‌వాడీ కేంద్రం–2, బుక్కపట్నంలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో శనివారం ఈసీసీ డే నిర్వహించారు. ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ గురించి అధికారులు తెలియజేశారు. పిల్లల్లో శారీరక, మేధో, సృజనాత్మక, భాషాభివృద్ధి అన్నీ ఉంటేనే సమగ్ర అభివృద్ధి చెందడానికి వీలుగా ఉంటుందన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తనకల్లు: నల్లగుట్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సత్యన్న సేన ఆధ్వర్యంలో శనివారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

శ్రీరంగనాథునికి ధనుర్మాస పూజలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని సూర్యచంద్రప్రభ అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం శ్రీరంగనాథుడికి ధనుర్మాస పూజలు నిర్వహించారు. ధనుర్మాసం మొదలు నుంచి నేటి వరకు అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రస్తా వివాదం పరిష్కరిస్తాం

ముదిగుబ్బ: మొగలిచెట్లపల్లిలో పొలాలకు వెళ్లే రస్తా వివాదాస్పదంగా మారడంతో శనివారం తహసీల్దార్ నారాయణస్వామితో కలిసి ఆర్డీఓ మహేష్ పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల పరిశీలించిన తర్వాత రస్తా వివాదం పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

కదిరి టౌన్: అదనపు కట్నం తేవాలంటూ భర్త మదన్‌మోహన్, అత్త, మరిది వేధిస్తున్నారని పట్టణంలోని గాంధీనగర్ మశానం పేటకు చెందిన సునీత శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భర్త, అత్త, మరిదిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

శంఖారావానికి కదిలిన హిందువులు

తలుపుల: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలోఆదివారం విజయవాడలో నిర్వహించనున్న 'హైందవ శంఖారావం' భారీ బహిరంగసభకు తలుపుల నుంచి పలువురు హిందువులు బస్సులో వెళ్లారు.

సంక్షిప్త సమాచారం

తొలుత వారు ఓబీఆర్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి



భవిత కేంద్రంలో చిన్నారులకు కేక్ తినిపిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని భవిత కేంద్రం, టింబక్టు కలెక్టివ్ సంస్థ సహకారంతో నిర్వహించబడుతున్న ప్రతిభా వికలాంగుల సొసైటీ కార్యాలయంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన అంధ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి ఎంఈఓ కళ్యాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దృష్టిలోపం (అంధులు) ఉన్న వారి కోసం లూయిస్ బ్రెయిలీ ప్రత్యేకంగా లిపి కనుగొన్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటనారాయణ, ఐఈఆర్పీలు మురళీకృష్ణ, అనిత, సీఆర్పీ కిష్టప్ప, కంప్యూటర్ ఆపరేటర్లు జానకీరామ్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ

చెన్నేకొత్తపల్లి: చిన్నారుల విద్య, సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని అంగన్‌వాడీ సిబ్బంది సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య కార్యక్రమంపై చిన్నారుల తల్లిదండ్రులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

ఇసుక లారీ సీజ్

ఓడీచెరువు : కదిరి నుంచి గోరంట్ల వైపు ఇసుక లోడుతో వెళ్తున్న లారీని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి శనివారం ఓడీ చెరువులో ఆపి తనిఖీలు చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో లారీని సీజ్ చేశారు. బాగేపల్లికి చెందిన లారీ ఓనర్ శ్రీనాథ్, డ్రైవర్ మధు కలిసి ఈ వ్యాపారం చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గాండ్లపెంట: బనాన్‌చెరువుపల్లి శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఏఎస్‌ఐ రంగ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.27,830 నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

జూదరుల అరెస్ట్

నల్లచెరువు: బాలేపల్లి తండా సమీపంలో జూదం ఆడుతున్న నలుగురిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మక్బూల్ బాషా తెలిపారు. వీరి నుంచి రూ.2,800 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బత్తలపల్లిని కరువు జాబితాలో చేర్చండి

బత్తలపల్లి: కరువు జాబితాలో బత్తలపల్లి మండలాన్ని చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. కరువు ప్రాంతంగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రమైన బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దారుణంగా దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. అనంతరం ఎస్‌ఐ సోమశేఖర్ సీపీఐ నేతలతో చర్చించి రాస్తారోకోను విరమింపజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపాన శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దిలీప్ అనే యువకుడు గాయపడ్డాడు. వెంటనే అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

సౌత్‌జోన్ వాలీబాల్ ఉమెన్ టోర్నీకి ఎంపిక

పుట్టపర్తి అర్బన్: చెన్నైలో ఈ నెల ఆరు నుంచి పదో తేదీ వరకు జరగనున్న వాలీబాల్ సౌత్‌జోన్ ఉమెన్ టోర్నీలో పాల్గొనే ఎస్కేయూ జట్టుకు పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మంగళకర కళాశాల విద్యార్థిని దివ్యశ్రీ ఎంపికైంది. దీంతో శుక్రవారం కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యా ప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు అధ్యాపక బృందం దివ్యశ్రీని అభినందించింది.

కందుల కొనుగోలుకు నమోదు చేసుకోండి

ధర్మవరం రూరల్: మద్దతు ధరకు కందుల కొనుగోలు కోసం రైతులు రైతు సేవ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ముస్తఫా సూచించారు. శనివారం మండల పరిధిలోని కుణుతూరు, పోతుకుంట గ్రామాల్లో కందుల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలు రూ.7,550 లేదా మార్కెట్ ధర ఏది ఎక్కువ అయితే ఆ ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేస్తామన్నారు.

చేనేతలు రాజకీయాల్లో రాణించాలి



కదిరి ఎమ్మెల్యే కందికుంటను సత్కరిస్తున్న చేనేత ఐక్య వేదిక నాయకులు

ధర్మవరం: చేనేతలు రాజకీయాల్లో రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. ధర్మవరంలో చేనేత సామాజికవర్గం వారు ఐక్యవేదికగా ఏర్పడి శనివారం శివానగర్‌లో భారీ సభ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలు తరలివచ్చారు. ఈ సందర్భంగా రాజకీయంగా ఉన్నత పదవులు పొందిన చేనేత సామాజికవర్గం ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. చేనేత ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చేనేత సామాజికవర్గం వారికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ ధర్మవరం పట్టణ చరిత్రలో చేనేతలు ఎంతోమంది అగ్రవర్ణాల వారిని అందలం ఎక్కించేందుకు కృషి చేశారన్నారు. ఆ సంస్కృతికి ముగింపు పలికి చేనేతల్లో రాజకీయ చైతన్యం తేవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. చేనేతలు స్థానిక సంస్థల నుంచి చట్ట సభల దాకా ప్రతి ఒక్కరూ పోటీ చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో చేనేత ప్రముఖులు గద్దం శ్రీనివాసులు నేత, బండారు ఆనంద ప్రసాద్, గిర్రాజు రవి, ప్రకాష్, పోలా ప్రభాకర్, జయశ్రీ, గుద్దిటి రాము, గద్దం పార్థసారథి, పరిశే సుధాకర్, బీరే గోపాలకృష్ణ, వెంకట్ అజయ్, కోనేటి వెంకటేశ్, కృష్ణమూర్తి, జయశంకర్, నరసప్ప, పల్లెం వేణుగోపాల్, చింతా నాగరాజు, కేవీ శేషయ్య, బీరే కేశవ, గుద్దిటి సోమదాస్, కుండా చౌదయ్య, నీలూరి శ్రీనివాసులు, ఉక్కిసిల గోవిందు, గుద్దిటి ఈశ్వరయ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టడానికి ప్రత్యేక చర్యలు

ధర్మవరం అర్బన్: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్డీఓ మహేష్, డీఎస్పీ శ్రీనివాసులు, సీడీపీఓ లక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం బాల్య వివాహ నిరోధక చట్టం–2006, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాల్య వివాహాల నిరోధక చట్ట నిబంధనలు–2023పై రెవెన్యూ డివిజన్‌స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ధర్మవరం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీడీపీఓలు, ఎంఈఓలు, సీఐలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఏకరువు



మాట్లాడుతున్న ఎంపీపీ రఫినాయక్

తలుపుల: విద్యుత్ సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. ప్రమాదాలు జరగకనే చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఎంపీపీ రఫినాయక్ అధ్యక్షతన ఎంపీడీఓ రామానాయక్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పులిగుండ్లపల్లి పంచాయతీలో కరెంటు పోళ్లు ఏర్పాటు చేయాలని, ఇళ్ల మీదుగా వెళ్లిన తీగలను కాస్త దూరంగా మార్పు చేయాలని సర్పంచ్ సుగుణమ్మ కోరారు. ట్రాన్స్‌కో ఏఈ రవితేజ మాట్లాడుతూ అంచనా వేసి డబ్బు చెల్లిస్తే పోళ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పక్కాగృహాలు, బిల్లుల మంజూరు వివరాలు ఎందుకు ఇవ్వడం లేదని ఏఈ భానును సర్పంచ్ మల్లినాయుడు, ఎంపీటీసీ శకుంతలమ్మ నిలదీశారు. సీసీ రోడ్లు మంజూరు చేయాలని సర్పంచ్ వెంకటనారాయణ సభదృష్టికి తెచ్చారు. మామిడి రైతులు ఇన్సూరెన్స్ ఆన్‌లైన్‌లో ఎక్కడ చెల్లించినా ఈ–క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఓ షాదాబ్ సూచించారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల గురించి సమాచారమిస్తే ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఓబుళేశ్వరి, వైద్యాధికారి అఫ్తాప్, సర్పంచ్ శ్రీలత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉజ్వల భవితకు పునాదులు వేయాలి



ధర్మవరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయి మనోహర్

కదిరి అర్బన్/ ధర్మవరం రూరల్: సమష్టిగా కృషి చేసి కిశోర బాలికల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయాలని సీడీపీఓ రాధిక సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కిశోరి వికాసం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాలికల్లో ఆత్మరక్షణ, డిజిటల్ భద్రత, సైబర్ క్రైం, ఆన్‌లైన్ వేదికలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలికల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, ఎంఈఓ ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ధర్మవరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మి, ఎంపీడీఓ సాయి మనోహర్, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ధర్మవరం డివిజన్

9912220717, 9912220726, 9010593486